క్లుప్తంగా

చంద్రప్రభ వాహనంపై భగవద్రామానుజులు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న భగవద్రామానుజాచార్యులు అవతార మహోత్సవాల్లో భాగంగా చంద్రప్రభ వాహనంపై స్వామివారు శనివారం ఊరేగారు. తిరుమంజనం, సేవాకాలం, శాత్తుమొరైను నిర్వహించారు.

పెద్దాస్పత్రి వద్ద ఆందోళన



నెల్లూరు(అర్బన్): నగరంలోని సర్వజన ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాను శనివారం చేపట్టారు. అనంతరం ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కాలేషాబాషాకు వినతిపత్రమిచ్చారు. నేతలు కోటేశ్వరరావు, సురేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పొదలకూరు : బీమా పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పొదలకూరు కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్ ఎం భాస్కర్‌చక్రవర్తి కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కెనరా బ్యాంకు ఖాతాదారుల అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన పథకాలపై అవగాహన కల్పించారు. జీవన్‌జ్యోతి పథకానికి 18 నుంచి 50 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఈ పథకం కింద ఏడాదికి రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షల బీమా సౌకర్యం వర్తిస్తుందన్నారు. సురక్ష బీమా పథకానికి 18 నుంచి 70 ఏళ్లలోపు వారు అర్హులని చెప్పారు. ఈ పథకం కింద రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ నెల 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. బ్యాంకు ఖాతాదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ ప్రదీప్‌కుమార్, బ్యాంకు మేనేజర్ నాగనాథ్, నెల్లూరు రీజియన్ కార్యాలయ సిబ్బంది, పొదలకూరు బ్రాంచి సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ముత్తుకూరు: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఆదాని కృష్ణపట్నంపోర్టు ఈహెచ్ఎస్ డిపార్ట్‌మెంట్ హెడ్ వేణుగోపాలరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం సందర్భంగా పోర్టులో ఉద్యోగులు, కార్మికులు శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్గారాలను అదుపు చేసేందుకు హరిత వనాలు పెంచడమే ఏకైక మార్గమన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని కోరారు. పోర్టు పర్యావరణ అధికారులు రాంబాబు, మధుసూదన్, కంటైనర్ టెర్మినల్ హెడ్ వీరేంద్రబెల్వాల్, హార్టీకల్చర్ ఇన్‌చార్జి సలీల్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.

కొత్తూరులో చోరీ

ఇందుకూరుపేట: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి నగదు, బంగారు అపహరించుకెళ్లారు. ఈ ఘటన కొత్తూరులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కొత్తూరుకు చెందిన నెట్రంబాకం నాగరాజు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి వేరే గ్రామంలోని గుడికి వెళ్లాడు. శనివారం వేకువ జామున ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచిఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఉంది. అందులో రూ.50 వేల నగదు, నాలుగున్నర సవర్ల బంగారం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకట రాజేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.

వైభవంగా మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం

ఇందుకూరుపేట: మండలంలోని రావూరు కండ్రిగలో జరుగుతున్న మహాలక్ష్మమ్మ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గ్రామోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. మహాలక్ష్మమ్మను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శుక్రవారం రాత్రి ప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఈద్ - ఉల్ - ఫిత్ర్

నెల్లూరు(బృందావనం): ఈద్ - ఉల్ - ఫిత్ర్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకొన్నారు. నగరంలోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బారాషహీద్ దర్గా, రంగనాయకుల పేట, సంతపేట, నవాబుపేట, నజీర్‌తోట, డైకస్ రోడ్డు, గాంధీనగర్, తదితర ప్రాంతాల్లోని ఈద్గాల వద్ద సందడి నెలకొంది.

• తొమ్మిదో డివిజన్లోని నజీర్‌తోట షాదీమంజిల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ శుభాకాంక్షలను తెలియజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అల్లాహ్ దీవెనలు ఉండాలని కాంక్షించారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు శ్రీనివాసులురెడ్డి, రఘు, అబ్దుల్ సలామ్, మైనార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు సిద్ధిఖ్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జనార్దన్‌రెడ్డికాలనీలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలను తెలుపుకొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



జనార్దన్‌రెడ్డి కాలనీలో..

ఘనంగా పరశురామ జయంతి



నెల్లూరు(బృందావనం): సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిరంలో పరశురామ జయంతిని భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. వైశాఖ శుద్ధ తదియ, అక్షయ తృతీయను పురస్కరించుకొని మందిరంలో కొలువైన కృష్ణుడు పరశురామ అలంకారంలో దర్శనమిచ్చారు. మందిర నిర్వాహకుడు సర్వేపల్లి అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పుష్పయాగం





నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విశేష పూజలను శనివారం నిర్వహించారు. 108 కలశాల్లో వివిధ రకాల ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. సీతారామ, లక్ష్మణ, సువర్చల, ఆంజనేయస్వామికి పుష్పయాగాన్ని నేత్రపర్వంగా జరిపారు. ఉభయకర్తలుగా సుబ్బారావు, రామచంద్రరావు, బలరామ్, సురేష్, అరవింద దంపతులు వ్యవహరించారు. నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, ఆర్యవైశ్య సంఘ నేత గోపాల్, ఈట హేమచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన క్రీడాభిమానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చిన్నతనంలో క్రికెట్ ఆడిన అందరూ 40 ఏళ్ల తర్వాత మరోసారి ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడి తమ క్రీడాభిమానాన్ని చాటుకున్నారు. అమెరికా, మలేసియా, సింగపూర్, కెనడా, నెల్లూరులో ఉన్న క్రీడాకారులు బుజబుజనెల్లూరులోని సీఏ క్రికెట్ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో ఉత్సాహంగా తలపడ్డారు. నెల్లూరులో తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకొని ఉత్సాహంగా గడిపారు.

పలువురికి సన్మానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ స్టేడియంలో రంజాన్ వేడుకలను ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు అబ్దుల్ ఖాదర్, నజీర్ అహ్మద్, రఫీ, సోనూ, బాషాను సత్కరించారు. డబ్ల్యూఐ 2022 ట్రెజరర్ బలరామయ్యనాయుడు, అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, రామ్మోహన్‌రెడ్డి, కోశాధికారి నజీర్ అహ్మద్, శ్రీనివాసులునాయుడు, ప్రసాద్‌నాయుడు, గౌరవాధ్యక్షుడు కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం: మినగల్లుకు చెందిన అల్లం శ్రీనివాసులు తనపై గ్రామానికి చెందిన జయసూర్య దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. అల్లం శ్రీనివాసులు తన పొలంలో నుంచి వస్తుండగా జయసూర్య ట్రాక్టర్‌తో అడ్డుతగిలి ఉద్దేశపూర్వకంగా దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు





నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పశువైద్య సిబ్బంది ఆటల పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. 100 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, జావెలిన్ త్రో, త్రోబాల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్, తదితర పోటీలను నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్స్ సర్జన్ సర్వీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మురళీకృష్ణారెడ్డి, సెక్రటరీ సుబ్బానాయుడు, ట్రెజరర్ సురేష్, ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమయ్య, సెక్రటరీ అరుణ, ట్రెజరర్ కృష్ణమూర్తి, క్రీడల విభాగ పరిశీలకుడు డాక్టర్ వసంతరాయులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యలక్ష్మిగా మహాలక్ష్మి



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని మహాలక్ష్మి దేవస్థానంలో వార్షిక వసంత పరిమళ కొలాయి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో శనివారం ప్రారంభించారు. అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా రాజా నరసింహరావు కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకుడు సుబ్బరామశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీరామ్ వెంకటసురేష్, రవి, నరేంద్రప్రసాద్, బాలాజీ, ఈట హేమచంద్రరావు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏకేనగర్ సెక్షన్ పరిధిలో గల ఆటోనగర్ సబ్‌స్టేషన్‌ను ఇండోర్ సబ్‌స్టేషన్‌గా ఆధునికీకరించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని టౌన్ - 1 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఉడ్‌కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలోని విక్రమ్‌నగర్, ఉడ్‌కాంప్లెక్స్, డ్రైవర్స్ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు, జ్యోతినగర్ ఫీడర్‌లోని టీచర్స్‌కాలనీ, వేదాయపాళెం, జ్యోతినగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం పది నుంచి 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆటోనగర్ ఫీడర్ పరిధిలోని ఆటోనగర్‌లో మధ్యాహ్నం 1.30 నుంచి 3.30 వరకు, వెంకటరెడ్డి నగర్ ఫీడర్ పరిధిలోని వెంకటరెడ్డినగర్, చైతన్యపురి, పాత వేదాయపాళెం, తదితర ప్రాంతాల్లో సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు సరఫరా ఉండదని వివరించారు.

పార్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. అమ్మవారు పార్వతీదేవిగా శనివారం దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

క్రైమ్ కార్నర్

ఇనుప కమ్మీల చోరీ

నెల్లూరు(క్రైమ్): భవన నిర్మాణం వద్ద ఉంచిన ఇనుప కమ్మీలు చోరీకి గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొత్తూరులో నివాసం ఉంటున్న బేల్దారి మేస్త్రి వెంకటేశ్వర్లు అదే ప్రాంతంలో శివకుమార్ ఇల్లు కట్టేందుకు కాంట్రాక్టును నెల క్రితం కుదుర్చుకున్నారు. తన బావమరిదితో కలిసి ఇంటి నిర్మాణ పనులను వెంకటేశ్వర్లు చేస్తున్నారు. ఇటీవల సుమారు రెండు టన్నుల 8 ఎంఎం ఇనుప కమ్మీలను కొనుగోలు చేశారు. బేస్‌మెంట్ కోసం టన్ను కమ్మీలను వినియోగించి మిగిలిన వాటిని పక్కనే ఉంచి చైన్ వేసి తాళాలేశారు. పనులు ముగించుకొని 20వ తేదీ రాత్రి ఇంటికెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు టన్ను కమ్మీలను అపహరించుకెళ్లారు. మరుసటి రోజు నిర్మాణ స్థలం వద్దకు వచ్చిన వెంకటేశ్వర్లు చోరీ విషయాన్ని నిర్ధారించుకున్నారు. సమీప ప్రాంతాల్లో ఆరాతీసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంపుతామని బెదిరింపులు

నెల్లూరు(క్రైమ్): వివాహితను చంపుతామని బెదిరిస్తున్న భర్తపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఏటీ అగ్రహారంలోని హరితా రెసిడెన్సీలో నివాసం ఉంటున్న బలరామిరెడ్డి, సుజాత దంపతులకు ఓ కుమార్తె ఉన్నారు. సుజాత పేరుపై లాడ్జి ఉంది. కుటుంబకలహాల నేపథ్యంలో తన భర్తపై గతంలో సంతపేట పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో లాడ్జిని వదిలెళ్లాలని.. లేని పక్షంలో చంపుతామని మరికొందరితో కలిసి భర్త తనను ఈ నెల 19న బెదిరించారని పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిడ్జి కోర్సుల్లో ఉచిత ప్రవేశం

నెల్లూరు (టౌన్): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సబ్జెక్టుల్లో కొంత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో బ్రిడ్జి కోర్సును ప్రవేశపెట్టామని విశ్వసాయి విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఆలోచన సరళిని బట్టి ఏ కోర్సులో రాణించగలరో సూచిస్తామన్నారు. పాఠ్యాంశాల్లోని కొన్ని టాపిక్స్‌పై అవగాహన కల్పించనున్నామని వివరించారు. జవాన్ల పిల్లలకు తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ కోర్సుల్లో శిక్షణను ఉచితంగా ఇవ్వనున్నామని వివరించారు.

చెత్త విషయమై దాడి

నెల్లూరు(క్రైమ్): చెత్త విషయమై తల్లీకూతురిపై ఓ మహిళ దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌లో నివాసం ఉంటున్న స్వాతి తన ఇంట్లోని చెత్తను వీధి చివర్లో రోజూ వేసేవారు. తన కుమార్తెతో కలిసి చెత్తను తీసుకెళ్లి ఎప్పటిలాగే వీధి చివరన శుక్రవారం వేశారు. ఈ క్రమంలో చెత్తను ఇక్కడే వేస్తే కొడతానంటూ అదే వీధిలో నివాసం ఉంటున్న రజని చెప్పు చూపించారు. దీంతో స్వాతి అక్కడి నుంచి వెళ్లి జరిగిన విషయాన్ని ఇంటి యజమానికి తెలియజేశారు. బయటకు రాగా.. స్వాతి, ఆమె కుమార్తెపై కర్రతో రజని దాడి చేశారు. అడ్డుకోబోయిన ఇంటి యజమానిపై సైతం దాడికి పాల్పడ్డారు. నిందితురాలి భర్త మద్యం మత్తులో వారిని అసభ్య పదజాలంతో దూషించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు.